భూ సేకరణ ఆపండి

ఆర్ఐ కాళ్లపైపడి వేడుకున్న మహిళలు

భూమిలో కందకం తీయొద్దని ఆర్ఐ కాళ్లపై పడి వేడుకుంటున్న మహిళలు

ములుగురూరల్, సెప్టెంబర్ 25 : మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో బుధవారం రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేస్తుండగా జంగాలపల్లి, ఇంచర్ల, బరిగలానిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అడ్డుకున్నారు. ఎర్రిగట్టమ్మ దేవాలయ శివారులో వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో 39 మంది రైతులకు ప్రభుత్వ భూమి పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఆ భూముల్లో జేసీబీలతో కందకాలు తీసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడికి వచ్చి రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ భూముల్లో కందకాలు తీయొద్దని, పనులు ఆపాలని ఆర్ఐ కాళ్ల మీద పడి వేడుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో భూములకు పట్టాలు కూడా ఇచ్చారని, అప్పటి నుంచి భూమిలో సాగు చేస్తున్నామని వాపోయారు. భూములను బలవంతంగా తీసుకోవాలని చూస్తే ఆత్మహత్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా, ఈ విషయమై ఆర్ఐని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఎన్నికపై హర్షం

మంగపేట, సెప్టెంబర్ 25 : పీఆర్టీయూ ములుగు జిల్లా శాఖ ఎన్నికపై ఆ యూనియన్‌కు చెందిన మంగపేట మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందా భద్రయ్య, మద్దెల నాగేశ్వర్‌రావు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వేం యాకూబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం నాయకత్వంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. మంగపేట మండలానికి చెందిన పెట్రం సుధాకర్‌రావు, పిల్లలమర్రి సాంబశివరావుకు జిల్లా ఉపాధ్యక్షులు, బీ నర్సింగరావు, వేణుమాధవ్‌రెడ్డి, అనసూర్యకు జిల్లా కార్యదర్శులుగా ఎన్నిక కావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గణపురం, సెప్టెంబర్ 25: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ నలుబాల సుమన్ సహా 17 మంది ఉపాధ్యాయులను బుధవారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బిల్ల రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల నూతన ప్రిన్సిపాల్ ఇమ్మడిశెట్టి తిరుపతి, మహిళా ఉపాధ్యాయురాలు స్రవంతి, పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిట్యాల, సెప్టెంబర్ 25 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని భూపాలపల్లి సీడీపీవో అవంతిక అన్నారు. గ్రోత్ మేళా సందర్భంగా చిట్యాల అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో చిన్నారులకు ఎత్తు, బరువులు కొలతలు నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒడితల పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కాటారం, సెప్టెంబర్ 25 : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, డాక్టర్ వందన అన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం మండలంలోని ధన్వాడ అంగన్‌వాడీ కేంద్రంలో వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ నిర్వహించారు. చిన్నారులకు ఎత్తు, బరువు పరీక్షించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను, సామ్, మామ్ పిల్లలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రంలో లభించే బాలామృతం తినిపించాలని, దాని వల్ల ఎత్తుకు తగిన విధంగా బరువుతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, రజిత, ఏఎన్‌ఎం రజిత, ఆశ సంధ్య పాల్గొన్నారు.

రోడ్లపైనే మాంసం షాపులు

- మార్కెట్‌లోకి మార్చేదెప్పుడో ?
- కంపు కొడుతున్న రహదారులు
- జంతు వధశాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- వృథాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన మార్కెట్ సముదాయం
- నిరుపయోగంగా ఫ్రూట్స్ మార్కెట్ గదులు

నూతనంగా నిర్మించిన వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ సముదాయం

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన మార్కెట్ సముదాయం కేవలం కూరగాయల విక్రయాలకు మాత్రమే పరిమితమైంది. చికెన్, మటన్, చేపల విక్రయాలకు సైతం ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసినప్పటికీ అందులోకి షాపులను మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వ్యాపారులు రోడ్లపైనే మాంసం విక్రయాలు జరుపుతున్నారు. వ్యర్థ పదార్థాలతో రోడ్లు కంపుకొడుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు జరుపుతున్నా మున్సిపల్ అధికారులు ముడుపులకే పరిమితమై పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంబేద్కర్ సెంటర్‌లో రోడ్లపైనే చుట్టూ చికెన్, మటన్, చేపల విక్రయాలు జరుపుతుండడంతో ఆదివారం అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ ప్రాంతం జాతరను మరిపిస్తున్నది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చొరవ చూపినా..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ సముదాయాన్ని నిర్మించి షాపులకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించింది. అయితే ప్రస్తుతం ఇక్కడ కూరగాయల షాపులు మాత్రమే కొనసాగుతున్నాయి. మార్కెట్ ముందు రోడ్డుపై చేపల విక్రయాలు కొనసాగుతుండగా కేటీకే 5 వ గనికి వెళ్లే ఈ దారి కంపు కొడుతుంది. అలాగే అంబేద్కర్ సెంటర్, గణేశ్ చౌక్‌లు నాన్‌వెజ్ విక్రయాలతో వచ్చే వ్యర్థాలతో నిండిపోతున్నది. నాన్ వెజ్ షాపులను మార్కెట్ సముదాయంలోకి మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాగే పండ్ల షాపుల వ్యాపారులకు సైతం ప్రత్యేంగా నిర్మించిన సముదాయంలోకి వారిని మార్చకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి.

జంతు వధశాల ఏదీ ?

జిల్లా కేంద్రంలో అధికారులు జంతు వధ శాల ఏర్పాటు చేయకపోవడంతో మటన్ షాపుల వ్యాపారులు రోడ్లపైనే మేకలు కోస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పశువైద్యాధికారి ధ్రువీకరించిన తర్వాతే జంతు వధ చేయాల్సి ఉంది. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, ఒక్కడ అవేమీ జరగడంలేదు. వ్యాపారులు చనిపోయిన, వ్యాధులతో ఉన్న మేకలు, గొర్రెలను సైతం కోస్తూ మాంసం యథేచ్ఛగా విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, అధికారులు వ్యాపారుల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకుంటలేరు..

రోడ్లపై చికెన్, మటన్ షాపులు ఏర్పాటు చేసి వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తున్నది. నాన్ వెజ్ షాపులతో ఇతర షాపులు నడపలేకపోతున్నాం. నేను టిఫిన్ సెంటర్ నడుపుతున్నా. చికెన్, మటన్ షాపుల వ్యర్థాల వాసనకు గిరాకీ రావడంలేదు. డ్రైనేజీలు లేకపోవడంతో మాంసం వ్యర్థాల నీరు షాపుల ముందు, రోడ్లపైకి వచ్చి చేరుతున్నది. వర్షాలు పడితే పరిస్థితి చెప్పలేకుండా ఉంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

- సకినాల శోభన్. చిరువ్యాపారి

రోడ్డుపై చేపల విక్రయాలు

మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మృతుల కుటుంబాలకు గండ్ర పరామర్శ

చిట్యాల, సెప్టెంబర్ 25 : మండలంలోని పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు.మండల కేంద్రానికి చెందిన సీఐ స్వామి తండ్రి తూటిచర్ల నర్సయ్య, కొత్తపేట గ్రామానికి చెందిన మధురకవి దినేశ్, ఒడితల చెందిన యాంసాని భద్రయ్య, కోడూరి రాజసమ్మయ్య, అందుకుతండకు చెందిన భూక్యా పూల్‌సింగ్ ఇటీవల మృతి చెందగా బుధవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి, నాయకుడు రాంబాబు, మండల యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, రవీందర్, భద్రయ్య, వెంకటేశ్, రాజు, వీరస్వామి, నాగేందర్, శంకర్, తిరుపతి, శ్రీనునాయక్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

మహాముత్తారం, సెప్టెంబర్ 25 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కళాజాత బృందంతో బ్యాంకు ఖాతాదారులకు కలిగే ప్రయోజనాలు, పథకాలపై వివరించారు. మేనేజర్ తిప్పని సంతోష్, కళాజాత బృందం విజయ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు బాలకృష్ణ, రాజేశ్, సీఎస్పీ రమాకాంత్, దేవేందర్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులు నాగాలు పెట్టొద్దు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 25 : సింగరేణి కార్మికులు విధులకు హాజరయ్యేలా కుటుంబ సభ్యులు చూడాలని, నాగాలు చేయవద్దని ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎస్ కవీంద్ర అన్నారు. బుధవారం భూపాలపల్లి మైన్స్ రెస్క్యూ స్టేషన్ సమావేశ మందిరంలో గైరు హాజరు ఉద్యోగుల రెండో విడుత అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. మూడేళ్లలో 51 నుంచి 100 మస్టర్ల కన్నా తక్కువ హాజరు ఉన్న 108 మంది ఉద్యోగులను అవగాహన సదస్సుకు పిలువగా 46 మంది మాత్రమే హాజరయ్యారు. కార్మికుల గైర్హాజరుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు డాక్టర్ హరిప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఎస్ జోతి, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, డీవైపీఎం క్రాంతికుమార్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జోగు బుచ్చయ్య, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణ కవచం పనితీరుపై గీత కార్మికులకు శిక్షణ

కాటారం, సెప్టెంబర్ 25 : అబ్కారీ, బీసీ సంక్షేమ శాఖ సంయుక్తంగా మండలంలోని ధన్వాడలో గీత కార్మికులకు రక్షణ కవచం పనితీరుపై బుధవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి 134 మంది శిక్షణకు హాజరైనట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు జశ్వంత్, తిరుపతి, అంజన్న, అశోక్, వెంకట్రాజం, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్, సిబ్బంది వెంకటరాజ్, కోటేశ్వర్, గీత కార్మిక సంఘం నాయకులు లింగం గౌడ్, మార్క రవీందర్, వెంకటరాజం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

మహాముత్తారం,సెప్టెంబర్ 25: పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రజిత, విజయ, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి యత్నించిన యువకుడిని రక్షించిన పోలీసులు

తాడ్వాయి, సెప్టెంబర్ 25 : మండలంలోని నార్లాపురం గ్రామానికి చెందిన నల్లమొక్క రంజిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రక్షించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రంజిత్ మనస్తాపం చెంది క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకునేందుకు నార్లాపురం, పస్రా గ్రామాల మధ్య రహదారిలో అడవిలోకి వెళ్లాడు. విషయం తెలిసిన అతడి స్నేహితులు ఎస్సైకి సమాచారం ఇవ్వగా సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా రంజిత్ ఉన్న స్థలాన్ని గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని కాపాడి 108 వాహనం ద్వారా ములుగు ఆస్పత్రికి తరలించారు. సరైన సమయంలో పోలీసులు స్పందించిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం

గోవిందరావుపేట, సెప్టెంబర్ 25 : ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పస్రాలో నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రజలకు రక్షిత తాగునీరు,అభివృద్ధిపై నిరంతరం పోరాటాలు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆగిరెడ్డి, నాయకులు చిట్టిబాబు, సాంబశివ, రాజేందర్, రాజేశ్, పోశాలు, మల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధర్మారెడ్డి, చంద్రారెడ్డి, ఆదిరెడ్డి, రాజు, మురళి, అరుణ్, రాజేశ్వరీ, రజిత, కవిత, సువర్ణ, శారద, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై గర్భిణులకు అవగాహన

ఏటూరునాగారం, సెప్టెంబర్ 25 : మండలంలోని చెల్పాకలో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోషణ లోపం ఉన్న వారిని గర్తించి వారికి వైద్య పరీక్షలు చేపట్టారు. తీవ్ర పోషణ లోపం ఉన్న ఐదుగురిని గుర్తించారు. అదేవిధంగా స్థానిక గురుకుల డిగ్రీ కళాశాలలో ఆరోగ్య సంరక్షణ, సమతుల ఆహారం, వ్యాయామం, యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో హేమలత, వైద్యాధికారి సుమలత, సూపర్‌వైజర్లు పుష్పావతి, శ్రీవిద్య, కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 25 : దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్ పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్య ప్రైవేటీకరణ అవుతున్నదని తెలిపారు. మోదీ పాలనలో దళితులపై అంతులేని దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. మత విద్వేషాలు, గ్రామాల్లో కుల ఘర్షణలు మినహా బీజేపీ దేశ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో నాయకులు మరాఠి కాంతారావు, రాసపల్లి భద్రయ్య, నేరేళ్ల జోసెఫ్, పీక రవి, పొనగంటి లావణ్య, సంధ్య పాల్గొన్నారు.

భవిష్యత్ ఉద్యమాలకు టీచర్లు సిద్ధం కావాలి

కాటారం, సెప్టెంబర్ 25 : టీచర్ల రేషనలైజేషన్ జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశమై విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రేషనలైజేషన్ జీవో 25ను విడుదల చేసిందనీ, ఈ జీవో పూర్తిగా అశాస్త్రీయమైందనీ, 60 మంది విద్యార్థులకు ఇద్దరు, 90 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉండాలనేది ఈ జీవో సారాంశమనీ, ప్రభుత్వ పీఎస్‌లను మూసివేసి ప్రైవేట్‌పరం చేయడంలో కుట్రలో భాగంగానే జీవో విడుదల చేశారన్నారు. 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. డీఏలను వెంటనే విడుదల చేసి, పీఆర్సీ నివేదికలను అమలుచేయాలన్నారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సేవా నాక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతి రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గండు రాజబాబు, ఆలేటి సాంబయ్య, మండల అధ్యక్షుడు బొల్లం సతీశ్, గంట రాజబాబు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్‌ఆర్‌ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి

91827 77711

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరఫున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

స్క్వాల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్క్వాల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్యప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

• ఆరోగ్య ప్రదాత కేసీఆర్

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. – గోదావరిఖని

• పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..

వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఒరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. – నెక్కొండ